అవసరంలో
వున్నవాడు స్నేహితుడా?
అవసరానికి
పనికి వచ్చేవాడు
స్నేహితుడా?

# గంటి రమాదేవి కథ

# ఐ యామె ఫూల్

ఎ ఫ్రెండ్ ఇన్ నీడ్ ఈజ్ వాట్ మై ఫ్రెండ్.

నేనో ఫూల్‌ని. వెర్రి వెంగళప్పను. తెలివి తక్కువ దద్దమ్మని.

ఎందుకంటారా?

ఏ ఫ్రెండ్ ఇన్ నీడ్ ఈజ్ ఫ్రెండ్ ఇన్‌డీడ్ అని నమ్మాను.

పరిశీలిస్తే — అక్కరలో వున్నవాడు నా స్నేహితుడో, అక్కరకు పనికొచ్చేవాడు స్నేహితుడో బోధపడదు.


అక్కరకు పనికొచ్చేవాడు స్నేహితుడు అన్న లిమిటెడ్ అర్థం తీసుకున్నవాడు ఫూల్, వెర్రి వెంగళప్ప, తెలివి తక్కువ దద్దమ్మాను. ఈ నగ్నసత్యం నాకు వూరికే తెలిసింది.

* * *

వారంలో ఆరు రోజులు ఆవకాయో చ్చడో వేసుకొని మజ్జిగ పోసుకుని భోజనం యిందనిపించాలి. యధావిధిగా అన్నీ వాలంటే కుదరదు. నాలాటి బేచ్‌లర్‌కి. ఆదివారం ఆలస్యంగా లేచి, ఆలస్యంగా కావల్సింది వండుకుని, తిని శుభ్రంగా నిద్రపోయి, సాయంత్రం అవబోతూంటే, మళ్లీ రేపు సోమవారమే అన్న తలంపు మనస్సును గుచ్చుతూ వుంటే, ఆ సమయంలో పరుగు పరుగున వచ్చాడు సుబ్రహ్మణ్యం.

"గురూగారు, కొంప మునిగిందండీ" అన్నాడు ఆయాస పడుతూ.

మధ్యాహ్నం నిద్రమత్తు ఇంకా వ



దలలేదు వాకు.

"నీళ్ల లేక ఎడారి ఓడల్లా బతుకుతున్నాం. కొంపమునిగే నీళ్లెక్కడ్నుండి వచ్చాయండీ" అన్నాను తేలిగ్గా.

"మా ఆవిడ చస్తానంటోందండి. దాన్తో పాటే మా అమ్మా, నాన్నా కూడానట."

"ఎందుకు?"

నా ప్రశ్నవిని నిట్టూర్చాడు సుబ్రమణ్యం. (ఆయన పేరును శుభ్రమణ్యం అని, సుబ్రహ్మణ్యం అని, సుబ్బర్ మణియం అని రకరకాలుగా వ్రాస్తూ వుంటారు ఆయన ఆఫీసులో, ఉత్తరాల్లో, పాల కార్డులో రేషన్ కార్డులో, ఎలక్ట్రిసిటీ కార్డులో).

"నే మాట తప్పానండీ."

"ఏం మాటిచ్చారూ?"

"అప్పు తీరుస్తానని."

"భార్యదగ్గర అప్పు తీసుకున్నారా?"

"లేదు. బయటే. ఇవాల ఆఖరి గడువు. కాబూలివాడు ఇంటిదగ్గర కూచుని తిడుతున్నాడు. ఆఫ్‌కోర్సు వాడి తిట్లు ఒక్క ముక్క అర్థం కావడం లేదనుకోండి."

"వచ్చి వాటర్థం చెప్పమనడం లేదు కదా" అన్నాను జోక్ చేస్తూ. సుబ్బర్ మణియం గార్కి కోపం వచ్చినట్టుంది. తమాయించుకుని అడిగాడు.

"మీరో వెయ్యి రూపాయలు సర్దాలి."

"వెయ్యా!"

"అవును. మీరు కాదంటే, నా భార్యా, అమ్మా, నాన్నా కట్ట కట్టుకుని చస్తామంటున్నారు. ఎల్లాగో సర్దుకుందా మనుకున్నా వీలు కాదండి."

"నీ దుంపతెగ" అని మనస్సులో అనుకుని, "నా దగ్గర అంత డబ్బుందని మీ కెలా తెలుసు" అన్నాను.

"బ్రహ్మచార్లు. పెద్ద ఖర్చులుండవ్. వెయ్యి రూపాయలుండడం గొప్పవిషయం ఏమీ కాదు. పెళ్లి చేసుకున్న వాదగ్గర ఏగాణి వుండదు కాని."

మా మేనకోడలు పెళ్లికని ఓ వెయ్యి రూపాయలు దాచుకున్న మాట నిజమే. అయినా, ఇప్పుడది ఇచ్చేస్తే అవసరం వున్నప్పుడు ఇస్తాడా?

"ఆలోచించకండి! మీరు బ్రహ్మచార్లు (అదేదో గొప్పబిరుదైనట్టు) కష్టాల్లో ఒక్కళ్ళకొకరం ఆదుకోవాలి. సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్ అన్నాడు కవి."

ఏడుపు తక్కువగా వుంది సుబ్రమణ్యం పని. ఆ ఏడుపు చూసి కరగలేదు.

బ్రహ్మచార్లు అన్న మెచ్చుకోలు (!) విని కరగలేదు.

"సృష్టిలో తీయనిది స్నేహమోనోయి" అన్నమాటకు పడిపోయాను.

"ఇవాళ్ల ఆదివారం. రేపు పదిన్నరకు పోస్టాఫీసులో డ్రా చేసి ఇస్తాను" అని మాటిచ్చాను.

"మర్నాడు కరకుల్లాటి వెయ్యి రూపాయలు శుభ్రమణియం చేతిలో పోశాను. ఆ సాయంత్రం తెలిసింది!

సుబ్రహ్ మణ్యం ముక్క ఆటగాడు. నలభై ఎనిమిది గంటలు వీర పేకాట ఆడి రికార్డు సృష్టించాట్ట. అమ్మా, నాన్న ఎవరూ లేరట.

మర్నాడు సుబ్బర్మణ్యం కనిపిస్తే అడిగాను.

"మీ అమ్మా, నాన్నా ఎలా వున్నారు?"

"ఓ వాళ్ళా!" అని సైకిలెక్కి

తురుమన్నాడు.

* * *

డబ్బు అవసరం వచ్చింది. సుబ్బర్మణియం నా దగ్గర డబ్బు తీసుకుని రెండు నెలలయింది. తన సీటుకు వెళ్లి డబ్బడిగాను. రెండు రోజుల్లో ఇస్తానన్నాడు. నా మేనకోడలు పెళ్లి పదిరోజులే వుంది. సుబ్రహ్మణ్యం చెప్పిన రెండు రోజులు గడిచిపోయాయి. సాయంత్రం అన్నాడు, ఉదయం అన్నాడు, రాత్రి అన్నాడు.... ఆఖరుకు పెళ్లి రెండు రోజుల్లో వుంది. చేతులెత్తేసాడు సుబ్రమణ్యం.

"డబ్బు దొరకలేదు బ్రహ్మాచార్లూ! ఓ పనిచేస్తారేంటి. సేఠ్ మిాసంలాల్ మోసంచంద్ దగ్గర మూడు రూపాయలకు దొరుకుతుంది. అక్కడ కెళ్లి మన ఆఫీసు పేరుచెప్పి డబ్బడగండి. వాచీ, వుంగరం పెడితేరెండు రూపాయలకే ఇస్తాడు. మన ఆఫీసు పేరు చెప్పండి.

వళ్ళు మండింది నాకు. సుబ్రమణ్యం మామూలుగా పేకాటాడుతూనే వున్నాడు. తన సరదాలు తీర్చుకుంటూనే వున్నాడు. పెళ్లానికి చీరెలు, పిల్లలకు, తనకూ బట్టలు, తీర్థయాత్రలు, ఇవన్నీ చేస్తూనే వున్నాడు. నా డబ్బివ్వడం లేదు.

"ఆఫీసు పేరు చెబితే చాలా! మిా పేరుకూడా చెప్పాలా?" అన్నాను చేతకాని రోషంతో.

"మిాసంలాల్ మోసంచంద్ దగ్గర డబ్బు అప్పు తీసుకున్నాను. నెలకు ముప్పై రూపాయలు. వడ్డీ రెండు సంవత్సరాలు కట్టాను. ఎరియర్స్ వస్తే అదీ, మరి కొంత అప్పుచేసి, అదీ కలిపి అప్పు తీర్చాను.

క్రమంగా సుబ్రమణ్యం సంగతి మర్చిపోయేను. అందుక్కారణం, నేవా వూరునుంచి కర్నూలుకు బదిలీ కావడం కావచ్చు. బ్రహ్మచారిత్వానికి సలాంకొట్టి, గృహస్థాశ్రమం స్వీకరించడం కావచ్చు.



ఆ రోజు

ములక్కాడల సాంబారు, అప్పడాలు, పెరుగు, ఆవకాయలతో సుష్టుగా తిని, భుక్తాయాసంగా పడక్కుర్చీలో సేద తీరుతున్నాను. మా ఇంటి ఎదురుగా వున్న ఇంట్లో పెద్ద గొడవ, అది కృష్ణారావుగారిల్లు. లేచి పరుగెత్తాను. కృష్ణారావుగారి భార్య నేలమీద పడివుంది. స్పృహలేదు. చుట్టు పక్కల వాళ్లు గుమిగూడారు. చోద్యం చూస్తున్నారు.

"ఏమయింది రావుగారూ?" అనడిగాను.

"ఉన్నట్టుండి పడిపోయిందండీ! తలకు దెబ్బ తగిలింది." కృష్ణారావుగారన్నారు.

రోడ్డుమీదకెళ్లి ఆటో తీసుకు వచ్చాను. ఆవిడ్ని, ఆయన్నీ ఆసుపత్రికి పంపించాను.

మర్నాడు ఆఫీసుకు తయారవుతూంటే. కృష్ణారావుగారు వచ్చారు.

"మీరేం అనుకోక పోతే ఒకటడుగుదామను కుంటున్నా?" అన్నాడాయన.

ఇప్పుడు నేను బ్రహ్మచారినీ కాదు. దాచుకున్న డబ్బూలేదు. ఇంతలో మా శ్రీమతి కూడా వంటింట్లోనుంచి వచ్చింది.

"వదినగార్కి ఎలా వుంది అన్నయ్యగారూ?" అనడిగింది.

"చెప్పలేదు డాక్టరు. తలకు తగిలిన దెబ్బ కాదమ్మా! ఎక్స్‌రే తీస్తేగాని తెలియదట."

"ఊహూ!... ఒక్కో టైము..." అని నిట్టూర్చి లోపలికెళ్లింది.

"మరోలా అనుకోకండి. మనకున్న స్నేహధర్మాన్ని దృష్టిలో వుంచుకుని అడుగుతున్నా. మూడు వేలు కావాలి. ఆసుపత్రి ఖర్చులు. డాక్టర్ల ఫీజులు, మందులూ."

"నా దగ్గర ఆ మాత్రం లేదండీ. వందో యాభయ్యో అయితే ఫర్వాలేదు."

"చాలదండీ. మీరే ఏదో దారి చూపాలి."

"లేదండీ! ఎక్కడ చూపినా, నాలుగొందలు దాటదు, ఇంటి అద్దె, పాలవాడికీ, వెచ్చాలకు ఇవ్వడం మానేస్తే."

"మన స్నేహధర్మాన్ని పురస్కరించుకుని సిగ్గువిడిచి అడుగుతున్నా మీరు చేయగలరు. ఇలా అయితే నా అవసరం తీరుతుంది."

ఆయన సూచనకు అదిరిపడ్డాను. నా ఇంటి సంగతి ఈయనకు ఎలా తెలిసిందీ అన్న ఆశ్చర్యం. ఆయన గడుసుతనానికి నేనోడిపోయాను. ఆయన చెప్పినట్టు చెయ్యక తప్పలేదు. దానికి మా శ్రీమతి వెంటనే అంగీకరించడం నాకుమరీ మరీ ఆశ్చర్యాన్ని కలిగించింది.

పది రోజులు తర్వాత నాకు అసలు సంగతి తెలిసింది.

సుబ్రమణ్యం విషయంలో నేనో ఫూల్‌నన్న విషయం నిరూపణ అయింది. కృష్ణారావు విషయంలో వెర్రి వెంగళప్పని, తెలివి తక్కువ దద్దమ్మని అని నిర్ధారణ అయింది.

కృష్ణారావు ఇంటి స్థలం కొంటున్నట్టు దానికి మూడువేలు తక్కువయ్యాయట.

పెళ్ళాన్ని మెళ్లో నగ ఇమ్మన్నాట్ట. ఆవిడ ఇవ్వ నందట. మాటా, మాట పెరిగింది. కోపం పట్టలేక కృష్ణారావుగారు పెళ్ళాన్ని బాదాట్ట. ఈడ్చి తన్నాడట. దాంతో ఆవిడ గోడమీద పడి తలకు గాయం చేసుకుందిట.

ఆసుపత్రిలో వుండగా ఆవిడే సలహా ఇచ్చిందిట. ఉత్తమ ఇల్లాలు! కృష్ణారావు నా మీద ప్రయోగించాడు ఆవిడ సలహా.

కొత్తగా పెళ్లయిన వాడిని. అత్తగారు ముచ్చటపడి రెండు తులాల గొలుసు పెట్టారు మా ఆవిడకు. దాని మీద పడింది ఆ దంపతుల కన్ను. నబ్బం గడిచిపోతుంది.

తన నగ ఇవ్వక్కర్లేదు. మీ స్నేహితుడింటి కెళ్లి అడగండి అందట కృష్ణారావు భార్య. నగ తాకట్టు పెట్టడానికి మా ఆవిడ ఒప్పుకుంది వెంటనే.

కృష్ణారావు నటనకు జోహార్ లర్పించాలి. ఆ డబ్బు కృష్ణారావుకిచ్చాను. ఆయన స్థలం కొనుక్కున్నాడు. నేను ఆ నగ విడిపించుకోడానికి నానా అవస్థలు పడ్డాను. ఒక సంవత్సరం రెండు నెలల్లో పూర్తి బాకీ తీర్చాడు ఇన్ స్టాల్ మెంట్లలో కృష్ణారావు.

సృష్టిలో తీయనిది స్నేహమేనోయి అని చెప్పిన ఆ కవి కనిపిస్తే చొక్కా కాలరు పట్టుకుని నా అనుభవాలు చెప్పి, వడ్డీ డబ్బులు కట్టమని వుందును.

ఆ మహానుభావుడెవరో ఇంతవరకు తారసపడ్లేదు.

నా కథ వింటే తన పద్యపాదాన్ని ఇలా మార్చేస్తాడు.

సృష్టిలో తీయనిది స్వార్థమేనోయి అని.

ఏమైనా ఒక్కటే నిజం —ఐ యామ్ ఎ ఫూల్.

*



దొంగ

'దొంగ దొంగ' అని అరుస్తున్నాడు భీమమూర్తి. అంతా వచ్చారు.

'ఏరయ్యా దొంగలు' అడిగాడు పక్కింటాయన్ని.

"వెళ్ళిపోయారు. అంతా దోచుకుని వెళ్ళిపోయారు" అన్నాడు కంగారుగా భీమమూర్తి.

"మరి అప్పుడే అరవలేకపోయావా".

"అయ్యో... నోరు తెరిస్తే నే కట్టించుకున్న బంగారు పన్ను కూడా ఎక్కడ లాక్కెళ్తారో అని అరవ లేదు" తాపీగా అన్నాడు భీమమూర్తి.

—యస్.యస్.ఆర్ (దొప్పలపూడి)